క్లుప్తంగా

బల్దియాలో పీరీల కోలాహలం



పీరీలను ఊరేగిస్తున్న భక్తులు

బెల్లంపల్లి: మొహర్రం వేడుకల్లో భాగంగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో పీరీలు సందడి చేస్తున్నాయి. బుధవారం మొహర్రం పండుగ ఉండటంతో నిర్వాహకులు బస్తీల వారీగా పీరీలను తీసుకువెళ్లి ప్రదర్శిస్తున్నారు. డప్పు చప్పుళ్లతో వీధుల్లో తిరుగుతూ ఊరేగిస్తున్నారు. ఇంటి ముంగిట వచ్చిన పీరీలకు భక్తి ప్రపత్తులతో మొక్కి ఆశీర్వాదం తీసుకుంటున్నారు. కుడుకలను ముడుపు కడుతున్నారు. రెండు రోజుల నుంచి మున్సిపాలిటీ వ్యాప్తంగా పీరీల వేడుకలు కోలాహలంగా కనిపిస్తున్నాయి. కుల మతాలకు అతీతంగా పీరీల గుండం వద్ద రోజు వారీగా ప్రత్యేక పూజలు చేసి అస్సైదులా ఆడుతున్నారు. పీరీల వేడుకలు మున్సిపాలిటీలో ఆధ్యాత్మిక శోభను తెచ్చి పెట్టింది.

మొక్కలు నాటడం అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

తాండూర్: పర్యావరణ పరిరక్షణం కోసం మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రత్నాకర్ రావు, డైరెక్టర్ గట్టు మురళీధర్ రావు, నాయకులు లక్ష్మణ్, బానేష్, లింగయ్య , పద్మ , ఏపీవో నందకుమార్, ఈసీ రమేష్, పంచాయతీ కార్యదర్శి కల్పన తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో గడ్డి జొన్న విత్తనాలు

కాసిపేట: మండలంలోని పశువైద్యశాలలో రైతులకు గడ్డి జొన్న విత్తనాలు (సీఎస్‌హెచ్ 24ఎంఎఫ్ రకం) అందుబాటులో ఉన్నాయని మండల పశువైద్యాధికారి కె.తిరుపతి తెలిపారు. రైతులు విత్తనాలు తీసుకొని పశుగ్రాసం పెంచుకోగలరని, ఈ పశుగ్రాసం మూడుసార్లు కోతలు నిర్వహించి పశువులకు అందించాల్సిందిగా సూచించారు. పశువుల మేతకు ఇబ్బంది పడకుండా ఉండటంతో పాటు ఇతర పశువుల యజమానులకు గడ్డిని విక్రయించే వీలు ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రజక వృత్తిదారులను ఆదుకోవాలి



అధ్యక్షుడికి నియామకపత్రం ఇస్తున్న ఆశయ్య

మందమర్రిరూరల్: తెలంగాణలో రజక వృత్తిదారులకు ఆధునిక లాండ్రీ షాపుల ఏర్పాటు కోసం రూ.పది లక్షల రుణాలను ఆర్థిక సాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. మందమర్రి పట్టణంలోని పాలచెట్టు సమీపంలో గల వారసంత ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన రజక వృత్తిదారుల సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో ఆధునిక వాషింగ్ ప్లాంట్‌కు శంకుస్థాపన పనులు ప్రారంభించారని, దానిని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, సొసైటీ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షుడిగా ఎంపికైన గంగరాజుల రాంచందర్‌కు నియామకపత్రం అందించి అభినందించారు.

సన్మానం

మంచిర్యాలటౌన్: ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చెల్ల విక్రంను సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరగా, కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా ఆటో కార్మికులను ఆదుకుంటామని రఘునాథ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, అందుగుల శ్రీనివాస్, పులి రాజేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా ‘ప్రజావాణి’

- అంతంత మాత్రంగానే దరఖాస్తులు
- అధికారుల హాజరూ నామమాత్రమే..
- సమస్యలు చెప్పుకోవడానికి ముందుకు రాని అర్జీదారులు



నెన్నెలలో ప్రజావాణిలో పాల్గొన్న నలుగురు అధికారులు

నెన్నెల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం మండలంలో మొక్కుబడిగా జరుగుతోంది. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గ్రామీణ ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 26శాఖల అధికారులు విధులు నిర్వర్తిస్తున్న సోమవారం నాటి గ్రీవెన్స్‌కు అధికారుల హాజరు నాలుగంకెలు దాటలేదు. మండలంలో ప్రతీ సోమవారం జరిగే గ్రీవెన్స్ పరిస్థితి ఇదే. అయినప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. సోమవారం జరిగిన ప్రజావాణికి ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, రెవెన్యూ, పీహెచ్‌సీ నుంచి ద్వితీయ శ్రేణి నుంచి అధికారులు ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. దీంతో సమస్యలు చెప్పుకోవడానికి అర్జీదారులు ఎవరూ ముందుకు రావడం లేదు. అధికారుల తీరు వల్ల ప్రజా సమస్యలకు పరిష్కారం లభించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వేమనపల్లిలో అర్జీలు నిల్..

వేమనపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించగా ఎలాంటి అర్జీలు రాలేదు. ఎంపీవో అనిల్‌కుమార్, ఏపీవో ఉమారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, ఈసీ మధు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చెన్నూర్‌లో రెండు ఫిర్యాదులు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూకు సంబంధించిన రెండు ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని, ఐకేపీ ఏపీఎం ప్రమీల, అధికారులు పాల్గొన్నారు.

మందమర్రిలో రెండు దరఖాస్తులు

మందమర్రిరూరల్: మందమర్రి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు దరకాస్తులు అధికారులకు అందించారు. మున్సిపాలిటీ పరిధిలోని నేషనల్ హైవే సమీపంలో శ్మశాన వాటికకు వినియోగించుకున్న స్థలాన్ని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీలో రైతుకు సంబంధించిన భూమిని ఫారెస్ట్ అధికారులు ఆక్రమించారని ఆరోపిస్తూ ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

లక్సెట్టిపేటలో ఐదు దరఖాస్తులు

లక్సెట్టిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాఘవేంద్రరావు అధ్యక్షతన గ్రీవెన్స్ డే నిర్వహించారు. అర్జీదారుల నుంచి ఐదు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, ఎంపీవో వెంకటరమణ, ఏపీఎం లక్ష్మి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆయనుంటే.. అందరూ ఉంటారు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి సోమవారం ఇటు అధికారులు, అటు అర్జీదారులతో నిండిపోయింది. కలెక్టర్ ఉదయం 10.30గంటల నుంచి అర్జీదారులు బారులు తీరండంతో మధ్యాహ్నం 1.30గంటల వరకు అర్జీలు స్వీకరించారు. గత సోమవారం కలెక్టర్ లేకపోవడంతో ప్రజావాణి 12గంటల తర్వాత వెలవెలబోయింది. ఇటు అధికారులు, అటు అర్జీదారులు సైతం అంతంత మాత్రంగానే వచ్చారు. కలెక్టర్ అందుబాటులో ఉండడంతో అధికారులు, అర్జీదారులు బారులు తీరారు.

ఈ సారి మొత్తానికే దుమ్మా...

గతవారం ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఉన్నతధికారులకు బదులు.. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి హాజరయ్యారు. ఈ సారి రెగ్యూలర్ ఉద్యోగి అటుంచి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కూడా రాకుండా పోయారు. ప్రజావాణి ముగింపు సమయంలో జిల్లా కలెక్టర్ అన్ని శాఖలకు సంబంధించి పెండింగ్ అర్జీలు వివరించారు. దీంతో పాటు సివిల్ సప్లయ్ శాఖకు సంబంధించి చెబుతుండగా అధికారులు ఎవరూ లేకపోవడం గమనార్హం.



మధ్యాహ్నం 1 తర్వాత కూడా క్యూలో అర్జీదారులు

భీమారంలో మూడు దరఖాస్తులు



దరఖాస్తు స్వీకరిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యల పరిష్కరించాలని కోరుతూ మూడు దరఖాస్తులు రాగా, దరఖాస్తులను జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య, ఎంపీడీవో రాధారాథోడ్ స్వీకరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతిబాపురావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి



ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తాండూర్: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహ పునఃప్రతిష్టాపన కోసం స్థలం కేటాయించాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అధికారులకు విన్నవించారు. ప్రజావాణిలో సోమవారం ఎంపీవో అక్తర్ మోహినొద్దిన్‌కు, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జాడి పోషం, గొర్లపల్లి వెంకటేష్, విజయ్, లక్ష్మీనారాయణ, దాగం రాజారాం, పాపయ్య, దుర్గం శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయించిన పోలీసులు



రోడ్డును బాగు చేయిస్తున్న సీఐ,ఎస్సై

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వర్షానికి తెగిపోయి నక్కలపల్లి, బద్దంపల్లి, బ్రహ్మనపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి జేసీబీతో వెళ్లి పగిలిపోయిన వంతెన శిథిలాలను తొలగించి మొరంతో తాత్కాలిక రోడ్డును వేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. నక్కలపల్లి గ్రామానికి వెళ్లేందుకు రాకపోకలను పునరుద్ధరణ చేయించిన సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్‌ను గ్రామస్తులు అభినందించారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

శ్రీరాంపూర్: ఈ నెల 21న ఇల్లందులో జరిగే తెలంగాణ ప్రగతి శీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ 5వ మహాసభ పోస్టర్లను ఐఎఫ్‌టీయూ నాయకులు విడుదల చేశారు. సీసీసీ కార్నర్‌లోని ఆ యూనియన్ కార్యాలయం వద్ద సోమవారం ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం చేతుల మీదుగా వీటిని ఆవిష్కరించారు. మహాసభలో ఆటో కార్మికుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం భవిష్యత్తులో చేపట్టే ఆందోళన కార్యక్రమాలను రూపొందిస్తామన్నారు. పెద్దసంఖ్యలో కార్మికులు ఈ మహాసభలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, శ్రీనివాస్, సమ్మయ్య, మధు, రవిలు పాల్గొన్నారు.

అమ్మమాట–అంగన్‌వాడీ బాట



దండేపల్లి: అమ్మమాట అంగన్‌వాడీ బాటలో సీడీపీవో



భీమారం: ర్యాలీలో పాల్గొన్న అధికారులు



కొత్తగూడెం అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ



ముస్లింబస్తి 1 అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో...

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించేందుకు గాను ప్రభుత్వం ఈ నెల 15నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ‘అమ్మ మాట అంగన్‌వాడీ బాట’ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ర్యాలీలను నిర్వహించారు. ఎన్టీఆర్‌నగర్‌లో వార్డు కౌన్సిలర్ బదావత్ ప్రకాశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచనదేవి ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్‌లు రేణుకాదేవి, సురేఖ, రాజేశ్వరి, పద్మావతి, మెప్మా సభ్యులు శారద, సవిత, అమూల్య పాల్గొన్నారు. ముస్లిం బస్తి 1లో అంగన్‌వాడీ టీచర్ పి.కాంత కృష్ణ, ఆయా మంజుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏసీసీ 2, 3అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీలను వార్డు కౌన్సిలర్ జోగుల శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించగా, అంగన్‌వాడీ టీచర్లు బి.శోభారాణి, ఎస్.పద్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య

దండేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక నుంచి ఆటపాటలతో బోధన జరుగుతుందని లక్సెట్టిపేట సీడీపీవో రేష్మా తెలిపారు. దండేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చేర్పించాలని ర్యాలీ

భీమారం: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరూతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘అమ్మ మాట–అంగన్‌వాడీ బాట’ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. ఇందులో ఎంపీడీవో రాధా రాథోడ్, ఎంపీవో బాపురావులతో పాటు ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

చెన్నూర్: పిల్లలను బడిబాట పట్టించాలనే ఉద్దేశంతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చెన్నూర్ పట్టణంలోని కొత్తగూడెం అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో మనోరమ, కౌన్సిలర్ జాడి సురేఖ తిరుపతి, మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాజ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, శారద, స్రవంతి, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆషాఢమాసం.. గోరింటాకు సంబురం



బెల్లంపల్లి: మున్సిపాలిటీ కన్నాల బస్తీ ఒకటో వార్డులో సోమవారం ఆషాఢ మాసం గోరింటాకు వేడుకలను మహిళలు అట్టహాసంగా నిర్వహించారు. ఆ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ సూరం సంగీత ఆధ్వర్యంలో మహిళలు సంప్రదాయబద్ధంగా వస్తున్న ఆచారాన్ని పాటించారు. మహిళలు ఒకరి చేతులకు ఒకరు గోరింటాకు పెట్టుకుని సంబురాలు జరుపుకున్నారు.

దండేపల్లి: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని దండేపల్లి మండలం గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో సోమవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుచ్చన్న, విద్యార్థులకు గోరింటాకు ప్రాముఖ్యతను తెలిపాడు. విద్యార్థులందరూ చేతులకు దంచిన గోరింటాకును పెట్టుకున్నారు. అది ఎర్రబడటంతో సంబరపడిపోయారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో సోమవారం ఏరియా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏరియా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు, ఏరియా జీఎం సతీమణి సవిత మనోహర్ ఈ కార్యక్రమానికి హాజరై క్లబ్ సభ్యులందరితో కలిసి వేడుకలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో లేడీస్ క్లబ్ ఏరియా కార్యదర్శి వాణి, కోశాధికారి కవిత, ఉర్మిళ, సుప్రియ, సుల్తానా తదితరులు ఉన్నారు.



బెల్లంపల్లి: గోరింటాకు ప్రదర్శిస్తున్న మహిళలు



దండేపల్లి: గోరింటాకుతో విద్యార్థులు

తైక్వాండో ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న శిక్షకులు మండ శ్రీనివాస్

మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలటౌన్: పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్‌లో సోమవారం జిల్లా స్థాయి తైక్వాండో ఎంపిక పోటీలను నిర్వహించారు. వివిధ విభాగాల్లో విద్యార్థులు పాల్గొనగా, తైక్వాండో శిక్షకులు మండ శ్రీనివాస్, శ్రావణ్, అరుణ్‌ప్రసాద్, ప్రభు, అజయ్‌లు పోటీలను ప్రారంభించారు. పోటీల్లో హ్యాపీ స్కాలర్ స్కూల్‌కు చెందిన కృషిత్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కృషిత్‌ను పాఠశాల కరస్పాండెంట్ విక్రమ్‌రావుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ ఆలయం వద్ద ఈ నెల 28న నిర్వహించే ఆషాఢ బోనాల జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. వేలం ద్వారా దుకాణాలు దక్కించుకున్న వారు అధిక రేట్లకు అమ్మకాలు చేపట్టవద్దని సూచించారు. ఎంపీడీవో రాజేశ్వర్ రావు, ఏటీడీఓ చిరంజీవి, ఆర్‌వో కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సొమ్ము కాజేసినట్లు డీపీవోకు ఫిర్యాదు



డీపీవోకు ఫిర్యాదు చేసిన పత్రం

కోటపల్లి: గ్రామపంచాయతీ అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన నిధులను ప్రైవేట్ వ్యక్తికి పంచిన ఘటన కోటపల్లి మండలంలో చోటుచేసుకోగా గ్రామస్తులు సోమవారం డీపీవోకు ఫిర్యాదు చేశారు. అన్నారం గ్రామపంచాయతీ నుంచి రూ.1లక్ష 20వేలను గ్రామ పంచాయతీ కార్యదర్శి సెగ్గం వెంకటేశ్ డ్రా చేసినట్లు గ్రామపెద్దలకు తెలియడంతో గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగం చేశావని గ్రామస్తులు కార్యదర్శి వెంకటేశ్‌ను నిలదీశారు. తొడే రాజేశ్వర్ రెడ్డి అనే వ్యక్తి అన్నారం గ్రామపంచాయతీ అభివృద్ధికై వెచ్చించిన నిధులను, సమగ్ర వివరాలను, ఆర్‌టీఐ చట్టంతో అడుగ్గా సమాచారం ఇవ్వాల్సిన కార్యదర్శి వెంకటేశ్ సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేశాడు. అందుకుగాను రాజేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి రూ.1లక్ష 20వేలు కార్యదర్శిని అడగ్గా గ్రామపంచాయతీ నిధుల నుంచి కార్యదర్శి చెల్లించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఏకమై రాజేశ్వర్‌రెడ్డిని ప్రశ్నించగా రూ.1లక్ష 20వేలు తిరిగి గ్రామ కార్యదర్శికి అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. తిరిగి ఇచ్చిన రూ.లక్ష ఇరవై వేలను కార్యదర్శి వెంకటేశ్ గ్రామపంచాయతీ ఖాతాలో జమచేయకుండా తన సొంతానికి వాడుకున్నాడని, నెల రోజుల నుంచి గ్రామపంచాయతీకి కూడా రావడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల ఉద్యోగుల బదిలీల్లో భాగంగా కార్యదర్శి వెంకటేశ్ ప్రయత్నిస్తున్నట్లు తెలుసుకోగా, కార్యదర్శి వెంకటేశ్ బదిలీ నిలుపుదల చేసి తాను వాడుకున్న రూ.లక్ష ఇరవై వేలను గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శశిపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

‘అక్రమ పరిహారానికి నాయకుల కుట్ర’

కాసిపేట: ప్రభుత్వ భూములకు పరిహారం కాజేసేందుకు కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలో నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎన్‌ఎస్‌యూఐ మాజీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్ కాకుండా ఇష్టానుసారంగా విద్యార్థులపై ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు పాటించని ఆ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు.

గొర్రెల యూనిట్ డీడీలు వాపస్ తీసుకోండి

కాసిపేట: గత ప్రభుత్వ హయాంలో గొర్రెల యూనిట్లకు డీడీలు కట్టిన గొల్లకుర్మయాదవ రైతులు డబ్బులు వాపస్ తీసుకోవడానికి పశువైద్యశాలలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా మండల పశువైద్యాధికారి తిరుపతి తెలిపారు. ప్రభుత్వ సూచన మేరకు దరఖాస్తులు తీసుకొని డీడీల సొమ్ము తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు.

చట్టాలు తెలుసుకోవాలి

శ్రీరాంపూర్: విద్యార్థి దశలోనే చట్టాలను తెలుసుకోవాలని ఎస్సై సంతోశ్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఉజ్వల స్కూల్‌లో సోమవారం ఆయన విద్యార్థులకు సైబర్ నేరాలు, షీటీమ్స్, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు.

ఘనంగా మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. పురోహితులు రాజనరేంద్ర శర్మ ఆధ్వర్యంలో హోమం కాల్చి భక్తి శ్రద్ధలతో ప్రతిష్టాపన చేశారు.

రెండుబెంచీల వితరణ

కోటపల్లి: మండలంలోని జనగామ గ్రామానికి చెందిన జాడి శేఖర్ తన తండ్రి గోపాల్ జ్ఞాపకార్థం రెండు బెంచీలను బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేయించారు. ప్రయాణికులకు బెంచీలను అందించిన శేఖర్‌ను మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, నాయకులు అభినందించారు.

వృద్ధాశ్రమానికి ఫ్రిజ్ అందజేత

చెన్నూర్: పట్టణంలోని సాయి వృద్ధాశ్రమానికి ఎన్‌ఆర్‌ఐ పడమటింటి శ్రేయస్ అనే యువకుడు ఫ్రిడ్జ్‌ను అందజేశారు. శ్రేయస్ అమెరికాలో ఉంటున్నప్పటికీ స్వగ్రామం పారుపల్లితో పాటు చెన్నూర్ పట్టణంలో సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పుల్లూరి సత్తెయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు మంచాల వెంకన్న, ప్రకాశ్, మురళి పాల్గొన్నారు.